సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 20 । ఆగస్టు । 2023



చీనీ టన్ను రూ.18 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.30
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.30 పలికింది. కనిష్టంగా రూ.13, సరాసరిన రూ.22 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.2°/ 22.4°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

ఆరుతడి పంటల సాగు లాభదాయకం



అవగాహన కల్పిస్తున్న డీపీఎం లక్ష్మానాయక్

మడకశిరరూరల్: ఆరుతడి పంటల సాగుతో రైతులు లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్ తెలిపారు. శనివారం మండలంలోని కదిరేపల్లి వద్ద రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తక్కువ వర్షపాతం నమోదైనా ఆరుతడి పంటలకు ఎలాంటి నష్టం ఉండదన్నారు. విత్తనాలను మూడు అడుగుల దూరంతో సాగు చేయాలన్నారు. ఘన, ద్రవ జీవామృతంతో విత్తనాలను శుద్ధి చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హనుమ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



జెండా ఊపి ప్రత్యేక సర్వీసును ప్రారంభిస్తున్న డీపీటీఓ మధుసూదన్

పుట్టపర్తి టౌన్: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని హనుమ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డీపీటీఓ మధుసూదన్ పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఒక సర్వీసును ఆయన జెండా ఊపి ప్రారంభించారు.మంగళ, శనివారాల్లో జిల్లాలోని ప్రతి డిపో నుంచి ప్రత్యేక సర్వీసు నడుపుతున్నామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనయతుల్లా, ఎస్టీఐ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవలు వినియోగించుకోండి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి.శ్రీనివాస్

అనంతపురం: ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం ప్రజా ప్రయోజన కేసుల పరిష్కారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజీమార్గంలో సమస్యల పరిష్కారానికి లోక్ అదాలత్ సరైన మార్గమన్నారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులున్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

సెప్టెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో సమస్య పరిష్కారానికి అధికారులు ముందుకు రావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ కోరారు. న్యాయ సేవా సదన్‌లో శనివారం వివిధ శాఖల జిల్లా అధికారులకు లోక్‌అదాలత్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

బురిడీ కొట్టేస్తున్నారు



- హిందూపురంలోని ఓ పెట్రోల్ బంకులో తక్కువ పెట్రోల్ పోస్తున్నారని రహమత్ పురానికి చెందిన రీలర్ బాబా వారం క్రితం బంకు నిర్వాహకులతో గొడవకు దిగాడు. గతంలో నాలుగైదు సార్లు మోసం జరిగిందని.. వాహనం నుంచి పెట్రోల్ బయటికి తీయగా సగమే వచ్చిందని వాదించాడు. రూ.230కు పెట్రోల్ పోయించుకుంటే రూ.120 ఇంధనం మాత్రమే బాటిల్‌లోకి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఒకే బంకులో నెల రోజుల వ్యవధిలో నాలుగు సార్లు మోసపోయినట్లు వాపోయాడు.
- ధర్మవరం నుంచి మామిళ్లపల్లికి వెళ్లే మార్గంలో ఉన్న ఓ పెట్రోల్ బంకులో రీడింగ్‌లో తేడా వస్తోందని వినియోగదారుల నుంచి అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఎవరైనా ప్రశ్నిస్తే 'పెట్రోల్ పోసేది లేద'ంటూ అక్కడ సిబ్బంది దబాయిస్తున్నారు. గత వారం రమేశ్ అనే వినియోగదారుడు దీనిపై ధర్మవరం పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఓ కానిస్టేబుల్ అక్కడికి వచ్చాడు. ఆయనకు కూడా సిబ్బంది సమాధానం ఇవ్వలేదు. పోలీసుల జోక్యం అనవసరం లేదంటూ బంకు నిర్వాహకుడు చిందులు తొక్కాడు.
- పెనుకొండలో కోటకు వెళ్లే దారిలో ఉన్న పెట్రోల్ బంకులో రెండు వారాల క్రితం ఓ వ్యక్తి తన కారుకు రూ.2 వేల పెట్రోల్ పట్టించాడు. అనంతరం అనంతపురం వెళ్తుండగా మార్గం మధ్యలోనే కారు ఆగిపోయింది. సమీపంలోని ధర్మవరంలో ఉన్న ఓ గ్యారేజ్ దగ్గరకు వెళ్లి కారు చూపించగా.. కల్తీ ఇంధనం కారణంగా ఇంజిన్ దెబ్బతిందని మెకానిక్ తెలిపాడు. దీనిపై సదరు బంకు వద్దకు వెళ్లి వినియోగదారుడు ప్రశ్నిస్తే అక్కడ సిబ్బంది బాధితుడిపైనే రుబాబు చేశారు.

- జిల్లాలోని పలు పెట్రోల్ బంకుల్లో మోసాలు
- మీటర్ రీడింగ్‌తో కొందరు.. కల్తీతో మరికొందరు
- అడిగినంత కొట్టకనే.. వినియోగదారులకు కుచ్చుటోపీ
- ఫిర్యాదుల్లేవంటూ 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు

సాక్షి, పుట్టపర్తి: జిల్లాలోని పలు పెట్రోల్ బంకుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు కల్తీ పెట్రోల్‌తో మోసం చేస్తుంటే మరికొందరు కొలతల్లో మాయాజాలం ప్రదర్శిస్తూ జేబులు నింపుకుంటున్నారు. అధికారులు కూడా పెద్దగా పట్టించుకోకపోవడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతోంది.

కొలతల్లో దగా ఇలా..

జిల్లా వ్యాప్తంగా వివిధ కంపెనీలకు చెందిన 119 పెట్రోల్ బంకులు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు లక్షలాది లీటర్ల పెట్రోల్, డీజిల్ అమ్మకాలు జరుగుతున్నాయి. తూనికలు, కొలతలు, పౌరసరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడటంలో పలు పెట్రోల్ బంకుల యజమానులు దోపిడీకి తెగబడుతున్నారు. ప్రధానంగా మీటర్ రీడింగ్ జంపింగ్‌తో నిర్దేశిత కొలతలో కోత పెడుతున్నారు. లీటర్ పెట్రోల్ లేదా డీజిల్‌కు 50 నుంచి 100 మిల్లీ లీటర్ల మేర తక్కువగా వస్తున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఎవరైనా ఎక్కువ మొత్తంలో ఇంధనం పోయించుకున్న క్రమంలో ముందు వాహనానికి పోసిన తర్వాత మీటర్‌పై ఉన్న రీడింగ్ నుంచే పోస్తూ దగా చేస్తున్నట్లు వాహనదారులు వాపోతున్నారు.

మామూళ్లతో సరి!

పెట్రోల్ బంకుల నిర్వాహకులు యథేచ్ఛగా మోసాలకు పాల్పడుతున్నా తూనికలు, కొలతలు, పౌరసరఫరాల శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఫిర్యాదు వస్తే స్పందిస్తున్నారు తప్ప.. నిరంతరం తనిఖీలు చేపట్టడం లేదు. వినియోగదారుల్లో సైతం చైతన్యం కొరవడడంతో మోసాలు జరిగితే గొడవకు దిగడం తప్ప ఫిర్యాదు చేయడం లేదు. మూడు నెలలుగా జిల్లాలో ఆ శాఖ అధికారులు అసలు తనిఖీలే చేసిన దాఖలాలు లేవు. 'మామూళ్లు' తీసుకుని వెళ్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులు రాలేదు



నేను విధుల్లో చేరినప్పటి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. పెట్రోల్ నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా తప్పుడు కొలతలు, కల్తీకి పాల్పడినట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. తూనికలు, కొలతల సిబ్బంది, డీటీలతో కలిసి తనిఖీలు చేపడతాం. మేం తనిఖీలకు వచ్చినప్పుడు ఫిర్యాదుదారులు కూడా వచ్చి సాక్ష్యం చెబితే బాగుంటుంది. ఫిర్యాదు ఇచ్చిన వారు మాతో పాటే వస్తే తనిఖీ చేయడం సులువవుతుంది. సిబ్బంది తక్కువగా ఉన్న కారణంగా జిల్లాలోని అన్ని ప్రాంతాలను సకాలంలో తనిఖీ చేయలేకపోతున్నాం.

– సుధాకర్, అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ



హిందూపురంలో పెట్రోల్ బంకు నిర్వాహకులను ప్రశ్నిస్తున్న ఓ వినియోగదారుడు (ఫైల్)

జిల్లాలో పెట్రోల్ బంకులు

ఇండియన్ ఆయిల్	హెచ్‌పీ	భారత్ పెట్రోలియం
65	33	21

రైతులకు న్యాయం

- పొలాలిచ్చిన వారిలో ఒక్కొక్కరికి మూడు ఇంటి పట్టాల పంపిణీ
- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: పేదలకు ఇంటి పట్టాల పంపిణీ కోసం ప్రభుత్వానికి పొలాలు అందించిన రైతులకు న్యాయం చేస్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం 37 మంది రైతులకు ఒక్కొక్కరికి మూడు చొప్పున 111 ప్లాట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ పోతులనాగేపల్లికి చెందిన 37 మంది రైతులు తమ పొలాలను ప్రభుత్వానికి అందించారన్నారు. నష్ట పరిహారం కింద గతంలోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేశామన్నారు. ఇంటి పట్టాలు కూడా ఇస్తామని హామీ ఇచ్చామని, అందులో భాగంగా ఒక్కో రైతుకు మూడు చొప్పున 37 మంది రైతులకు 111 ప్లాట్లు అందించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ తిప్పేనాయక్, తహసీల్దార్ యుగేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.

'గ్రూప్స్' ఉచిత శిక్షణకు నేడు ప్రవేశ పరీక్ష

అనంతపురం రూరల్: గ్రూప్–1, గ్రూప్–2 పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కోసం ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల, కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ మూడు కేంద్రాల్లో 1,667 మంది అభ్యర్థులు ప్రవేశ పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. apstdc.apcfss.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు.

'చలివెందుల'పై వైఎస్సార్ సీపీ జెండా

- సర్పంచ్‌గా ఘన విజయం సాధించిన పార్టీ బలపరిచిన ఉపేంద్ర
- ఉప ఎన్నిక జరిగిన అన్ని ప్రాంతాల్లో అధికార పార్టీ హవా



ఉపేంద్ర కుమార్ రెడ్డికి సర్పంచ్‌గా డిక్లరేషన్ అందిస్తున్న అధికారులు

సాక్షి, పుట్టపర్తి: హిందూపురం మండలం చలివెందుల పంచాయతీకి జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఉపేంద్ర కుమార్ రెడ్డి ఘన విజయం సాధించారు. టీడీపీ బలపరిచిన రవీంద్రా రెడ్డిపై 337 ఓట్ల మెజారిటీతో జయకేతనం ఎగురవేశారు. ఇక.. జిల్లా వ్యాప్తంగా 13 వార్డులకు జరిగిన ఎన్నికల్లోనూ 6 చోట్ల అధికార వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులు విజయ దుందుభి మోగించారు. జిల్లాలో 1 సర్పంచ్, 28 వార్డు స్థానాలకు ఎలెక్షన్ కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చింది. అందులో 15 వార్డులు ఏకగ్రీవం కాగా, మిగిలిన స్థానాలకు శనివారం ఎన్నికలు జరిగాయి.

ఫలితాల వివరాలిలా..

గాండ్లపెంట మండలం బానాన్‌చెరువుపల్లి పంచాయతీ 9వ వార్డు ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ బలపరిచిన డి.విజయమ్మ 27 ఓట్ల మెజారిటీతో జయకేతనం ఎగరేశారు. సోమందేపల్లి మండలం బ్రహ్మసముద్రం పంచాయతీ రెండో వార్డు ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు వెట్టి కంబళప్ప 21 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. తలుపుల మండలం ఉడుములకుర్తి పంచాయతీ 4వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారు రమేశ్ నాయుడు 31 ఓట్లతో గెలిచారు. రొద్దం పంచాయతీ మూడో వార్డు ఉప ఎన్నికలో టీడీపీ మద్దతుదారు ఈశ్వరప్ప 61 ఓట్లతో, బుక్కపట్నం మండలం కృష్ణాపురం పంచాయతీ ఏడో వార్డు ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు మందల మంజుల మూడు ఓట్ల తేడాతో,అమడగూరు పంచాయతీ 11వ వార్డులో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు నారాయణస్వామి ఒక ఓటు తేడాతో, ఇదే మండలంలోని చిన్నగానిపల్లి పంచాయతీ మూడో వార్డులో టీడీపీ బలపరిచిన దేవరాజు ఏడు ఓట్ల మెజారిటీతో విజయం దక్కించుకున్నారు. అలాగే, గోరంట్ల పంచాయతీ 18 వార్డు ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎర్రమ్మ గారి నరసింహప్ప 160 ఓట్ల మెజారిటీతో విజయదుందుభి మోగించారు. అగళి పంచాయతీ రెండో వార్డులో టీడీపీ మద్దతుదారు నరసింహమూర్తి 36 ఓట్ల మెజారిటీతో, అమరాపురం మండలం నిద్రఘట్ట పంచాయతీ 4వ వార్డు ఉప ఎన్నికలో టీడీపీ మద్దతుదారు కెంచమ్మ 22 ఓట్లతో, గుడిబండ మండలం గునేమోరుబాగల్ పంచాయతీ 10వ వార్డులో టీడీపీ మద్దతుదారు నరసింహప్ప 30 ఓట్లతో, బత్తలపల్లి మండలం తంబాపురం పంచాయతీ 3వ వార్డు ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు లక్ష్మినారాయణమ్మ 72 ఓట్ల మెజారిటీతో, లేపాక్షి మండలం పులమతి పంచాయతీ 10వ వార్డు ఉప ఎన్నికలో టీడీపీ బలపరిచిన నవీన్ 16 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

పులకించిన ప్రశాంతి నిలయం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న శ్రీకాకుళం సత్యసాయి యూత్

ప్రశాంతి నిలయం: సత్యసాయిని స్మరిస్తూ శ్రీకాకుళం సత్యసాయి యూత్ నిర్వహించిన సంగీత కచేరీతో ప్రశాంతి నిలయం పులకించింది. పర్తి యాత్రలో భాగంగా ప్రశాంతి నిలయం చేరుకున్న శ్రీకాకుళం సత్యసాయి భక్తులు శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత కచేరీ నిర్వహించారు. సత్యసాయి ఆధ్యాత్మిక వైభవాన్ని,ప్రేమ తత్వాన్ని కొనియాడుతూ భక్త కోటిని పరవశింపజేశారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. కళాకారులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు నూతన వస్త్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

మానవత్వంతో పనిచేయండి

- టీచర్లకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ హితవు

కదిరి అర్బన్/ఎన్పీకుంట: 'ప్రభుత్వం విద్యారంగానికి రూ.కోట్లు ఖర్చుచేస్తున్నా మీరు బాధ్యతగా పనిచేయకపోవడంతో వృథా అవుతోంది. మీ పిల్లలైతే ఇలాగే చేస్తారా? ఇకనైనా మానవత్వంతో పనిచేయండి. సొంత బిడ్డల్లా భావించి విద్యార్థులకు పాఠాలు చెప్పండి' అంటూ టీచర్లకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ హితవు పలికారు. కదిరి, ఎన్పీ కుంట మండలంలోని పలు పాఠశాలలు, జూనియర్ కళాశాల, సచివాలయాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. వీవర్స్ కాలనీ పాఠశాలలో విద్యార్థుల వర్క్ బుక్కుల నిర్వహణ బాగా చేసిన ఉపాధ్యాయురాలు పద్మను అభినందించారు. పాఠశాలను సమీపంలోని ఉన్నత పాఠశాలలో ఎందుకు విలీనం చేయలేదని ఎంఈఓ చెన్నకృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటాగుళ్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సబ్జెక్టుల్లో వెనుకబడి ఉండడం గుర్తించిన ఆయన.. పిల్లలను బయటకు పంపి టీచర్లతో మాట్లాడారు. 'తరగతిలోని 40 మంది విద్యార్థులకు రూ.15 లక్షల విలువైన ట్యాబ్‌లను ప్రభుత్వం అందించింది. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం ఇలా లేదు. ఇంత చేస్తున్నా మీ నిర్లక్ష్యం కారణంగా చెడ్డ పేరు వస్తోంది. పనితీరు మార్చుకోకుంటే రిమూవ్ చేయాల్సి ఉంటుంది' అని హెచ్చరించారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ వర్క్‌బుక్ నిర్వహణ సరిగా లేకపోవడంతో అధ్యాపకురాలు లక్ష్మీ, ప్రిన్సిపాల్ దామోదర్‌ను మందలించారు. అనంతరం ఎన్పీ కుంట మండలంలోని సారగుండ్లపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. కేవలం 8 మంది విద్యార్థులన్నా సరైన విద్యాబోధన అందించకపోవడంపై హెచ్‌ఎం శ్రీనివాసులుపై మండిపడ్డారు. ఎంఈఓ గోపాల్‌నాయక్‌పైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ అరుణ్‌బాబుకు ఫోన్‌లో సంబంధిత అధికారుల తీరును వివరించారు. కాగా, టీచర్ల సమస్యలపై పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు శ్రీధర్‌రెడ్డి ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి, డీఈఓ మీనాక్షి తదితరులున్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

శ్రావణం... భక్తి పరవశం




నవగ్రహ పూజలు నిర్వహిస్తున్న సత్యనారాయణ శాస్త్రి, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులతో ఆలయ పదాధికారులు

- పూజల్లో పాల్గొన్న శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులు

పావగడ: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని తొలి శనివారం పావగడ శనీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము 3 గంటలకే స్వామి దర్శనానికి బారులు తీరారు. సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. ఉదయం 4 గంటలకు ప్రధాన అర్చకుడు అనంతరామ భట్ నేతృత్వంలో స్వామి వారికి తైలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక భవనంలో శనీశ్వరుడు, జ్యేష్టాదేవి పంచలోహ విగ్రహాలను ప్రతిష్టించినవగ్రహ పూజలను అర్చకుడు సత్యనారాయణ శాస్త్రి నిర్వహించారు. వందలాది మంది భక్తులు నవగ్రహ పూజల్లో పాల్గొన్నారు. తులాభారంలో భక్తులు నిలువెత్తు బియ్యం, బెల్లం తదితర కానుకలు, తల నీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చిత్రదుర్గం, చెళ్లకెర, హిరియూరు, దావణగెరె, అనంతపురం, వైఎస్సార్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి.

శనీశ్వరుడి సన్నిధిలో శింగనమల ఎమ్మెల్యే

తొలి శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని అనంతపురం జిల్లా శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి దంపతులు కుటుంబసమేతంగా శనీశ్వరుడిని దర్శించుకున్నారు. తైలాభిషేకం నిర్వహించి, నవగ్రహ పూజల్లో పాల్గొన్నారు. శీతలాంభదేవికి కుంకుమార్చన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి మాట్లాడుతూ.. ఏపీలో మళ్లీ జగనన్న ప్రభుత్వమే వస్తుందని, సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల లబ్ధి పొందిన అన్ని సామాజిక వర్గాలు మరోసారి ఆయనే సీఎం కావాలని ఆకాంక్షిస్తున్నారన్నారు.అనంతరం ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే దంపతులను ఆలయ సమితి పదాధికారులు ఘనంగా సన్మానించారు.

ఆలయాలకు శ్రావణ శోభ

కదిరి టౌన్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కదిరిలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, సైదాపురం ఆంజనేయస్వామి ఆలయం, పంచముఖ అంజనేయస్వామి, ద్వారక ఆంజనేయ స్వామి, అభయాంజనేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను రంగురంగుల పూలతో అర్చకులు అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదలు అందజేశారు.

భక్తి శ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



వ్రతం చేస్తున్న మహిళలు

ధర్మవరం అర్బన్: శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని ధర్మవరంలోని శ్రీనివాసనగర్‌లో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏడు శనివారాల వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు విశేష పూజలు, అలంకరణలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని వ్రతమాచరించారు. కార్యక్రమంలో అర్చకుడు రాజేష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీష్, కార్యదర్శి జింకా రాజేంద్రప్రసాద్, కోశాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్ బాబు

పుట్టపర్తి టౌన్: ఆరోగ్య కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన పీసీపీఎన్‌డీటీ (లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం) సమావేశం నిర్వహించారు. స్కాన్ సెంటర్ల దరఖాస్తులు, రెన్యూవల్స్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు, ఐసీడీఎస్, హెల్త్ డిపార్ట్‌మెంట్ సమన్వయంతో డెకాయ్ ఆపరేషన్లు ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రతి నెలా స్కానింగ్ సెంటర్లు తనిఖీ చేసి లింగ నిర్ధారణ చేసిన సెంటర్లకు అనుమతి రద్దు చేసి కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, దిశ డీఎస్పీ వరప్రసాద్, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, డిఐఓ కృష్ణయ్య, డెమో అధికారి బాబా ఫక్రోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే తిప్పేస్వామి



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది

మడకశిర: ఉద్యోగుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందికి 23 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రభుత్వం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మడకశిరలోని మండల సమాఖ్య కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి నియోజకవర్గంలోని క్రాంతిపథకం సిబ్బంది పాలాభిషేకం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ... చంద్రబాబు హయాంలో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని గుర్తు చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయకుండా వేధింపులకు గురి చేశారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులను తన కుటుంబసభ్యులుగా సీఎం వైఎస్ జగన్ భావిస్తూ వారి సంక్షేమానికి బాటలు వేశారన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేశారన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం విప్లవాత్మకమన్నారు. భవిష్యత్‌లోనూ ఉద్యోగుల అన్ని సమస్యలను ప్రభుత్వం పరిష్కారిస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే డా.తిప్పేస్వామిని క్రాంతిపథం ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎంలు రవి, తిప్పన్న, సురేష్, నాగరాజు, ముత్యాలప్ప, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

గొంతు కోసుకొన్న లారీ డ్రైవర్



చికిత్స పొందుతున్న రాజేందర్

పెనుకొండ రూరల్: కంటైనర్ లారీని లోడ్ చేపించడంలో కన్సల్టెన్సీ నిర్వాహకులు అలసత్వం ప్రదర్శిస్తుండడంతో అసహనానికి గురైన ఓ డ్రైవర్ గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు... రాజస్తాన్‌కు చెందిన రాజేందర్... కంటైనర్ డ్రైవర్‌గా కియా కార్లను షోరూంలకు తరలిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం కియా పరిశ్రమ వద్దకు కంటైనర్‌తో చేరుకున్న ఆయన.. స్థానిక చేతక్ ట్రాన్స్‌పోర్టు నిర్వాహకుల వద్ద రిపోర్ట్ చేసుకున్నాడు. రోజులు గడుస్తున్నా.. తన కంటైనర్‌ను లోడింగ్‌కు అనుమతించకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పొద్దుపోయాక మరోసారి కన్సల్టెన్సీ నిర్వాహకులను కలసి తన కంటైనర్‌ను లోడింగ్ చేయించాలని కోరాడు. ఆ సమయంలో వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో అసహనానికి గురైన రాజేందర్.. కాయగూరలు కోసే కత్తితో గొంతు కోసుకున్నాడు. విషయాన్ని గమనించిన తోటి డ్రైవర్లు వెంటనే రాజేందర్‌ను పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ ప్రసాద్ పెనుకొండ ఆస్పత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి




మృతులు గుర్రప్ప, శేషమ్మ

సోమందేపల్లి/గుడిబండ: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు... సోమందేపల్లి మండలం బ్రహ్మసముద్రం గ్రామానికి చెందిన గుర్రప్ప (70) భార్య కొంత కాలం క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం ఇంట్లో విద్యుత్ దీపాలు ఆర్పే క్రమంలో స్విచ్ ఆఫ్ చేస్తుండగా షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన స్థానికులు ట్రాక్టర్‌లో పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా ఎన్నికల విధులకు హాజరైన కానిస్టేబుల్ జగన్‌నాయక్ సీపీఆర్ చేస్తూ ప్రాణాలు కాపాడేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ కుమార్ తెలిపారు.

- మరో ఘటనలో గుడిబండ మండలం చిగతుర్పి గ్రామానికి చెందిన శేషమ్మ(56) శనివారం తన బంధువుల తోటకెళ్లి వక్కలు ఏరుకుని కంచె దాటే ప్రయత్నం చేస్తూ విద్యుత్ షాక్‌కు గురైంది. కంచెకు విద్యుత్ సర్వీసు వైర్ నుంచి కరెంటు సరఫరా అవుతున్న విషయం ఆమెకు తెలియదు. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ చంద్రశేఖర్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బావిలో పడి ఎలుగుబంటి మృతి



బావిలో తేలుతున్న ఎలుగుబంటి కళేబరం

గుడిబండ: బావిలో పడి ఓ ఎలుగుబంటి మృతిచెందింది. అటవీశాఖ అధికారులు తెలిపిన మేరకు.. గుడిబండ మండలం బైరేపల్లి చెరువు వెనుక ఉన్న ఓ రాతికట్టడం బావిలో శనివారం ఉదయం ఎలుగుబంటి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఎలుగుబంటి కళేబరాన్ని వెలికి తీయించి, పశువైద్యాధికారులతో పోస్టుమార్టం నిర్వహించారు. సుమారు 8 సంవత్సరాల వయసున్న మగ ఎలుగుబంటిగా నిర్ధారించారు. ప్రమాదశాత్తు బావిలో పడిందా? లేదా వేటగాళ్ల ఉచ్చులో పడి మృతి చెందిందా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. అనంతరం ఎలుగుబంటి కళేబరాన్ని అక్కడే దహనం చేశారు. కార్యకక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రనాథరెడ్డి, పెనుకొండ అటవీశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, సబ్ డీఎఫ్‌ఓ ఆనంద్, వెటర్నరీ ఏడీ అమర్నాథరెడ్డి, ఫారెస్ట్ ఇన్‌చార్జ్ సెక్షన్ ఆఫీసర్ కుళ్లాయప్ప, ఏబీఓలు వెంకటరమణప్ప, సంజీవయరాయుడు పాల్గొన్నారు.